# స్కూల్ ఫీజు 24 లక్షలు?

రాష్ట్రంలో ఇదే అత్యధిక ఫీజు • ఇంటర్నేషనల్ పేరుతో స్కూళ్ల దోపిడీ

గ్రేటర్‌లో 120 బడుల్లో అత్యధికంగా ఫీజులు • ఈ పాఠశాలల్లో ఐదారు లక్షలకు మించి వసూలు

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్‌లోని ఓ పాఠశాల ఒక్క ఏడాది చదువుకు అక్షరాలా రూ. 24లక్షల ఫీజు వసూలు చేస్తుంది. ఈ పాఠశాలలో పదేండ్లు పూర్తయ్యే సరికి అయ్యే ఫీజు మొత్తం 2.4కోట్లు. తెలంగాణలోని ప్రైవేట్ స్కూళ్లల్లో వసూలు చేస్తున్న ఫీజుల్లో ఇదే అత్యధికం. ఇంటర్నేషనల్ బ్రాండ్ పేరుతో ఈ స్కూల్ ఫీజుల మోత మోగిస్తున్నది. ఇలా రాష్ట్రంలోని మరికొన్ని స్కూళ్లు వసూలు చేస్తున్న ఫీజుల మొత్తాన్ని వింటే గుండెలు గుబిల్లుమనడం ఖాయం. మన దగ్గర ఎంబీబీఎస్ బీ క్యాటగిరీ సీటు ఫీజు 15లక్షలుండగా, సదరు పాఠశాలలో ఫీజు 24లక్షలు వసూలు చేస్తుండటం గమనార్హం. హైదరాబాద్‌లో 120కి పైగా పాఠశాలలు అత్యధికంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఈ పాఠశాలల్లో ఫీజులు ఐదారు లక్షలకు మించి ఉన్నాయి. ఇవి చాలవంటూ లంచ్, స్నాక్స్‌కు, ట్రాన్స్‌పోర్టు ఫీజులు రూ. 50 నుంచి లక్ష వరకున్నాయి. రాష్ట్రంలో 10వేలకు పైగా ప్రైవేట్ పాఠశాలలున్నాయి. ఫీజుల దందాకు చెక్‌పెట్టే లక్ష్యంతో విద్యాకమిషన్ ఇటీవలే ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. కొత్త విద్యాసంవత్సరం సమీపిస్తున్నది. ఇప్పటికే పలు పాఠశాలల్లో అడ్మిషన్లు పూర్తయ్యాయి. ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురాబోతున్నది. ఈ నేపథ్యంలో ఫీజుల కట్టడి సాధ్యమేనా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**గ్రేటర్‌లోని పలు స్కూళ్ల ఫీజు ఇలా..**

- హైదరాబాద్ శివారులోని మరో ఇంటర్నేషనల్ స్కూల్‌లో రిజిస్ట్రేషన్ ఫీజు 83 వేలు. ఎన్‌రోల్‌మెంట్ ఫీజు 8.30లక్షలు. కిండర్ గార్టెన్ ఫీజు 8.73 లక్షలు, 1–5 తరగతులకు 9.38లక్షలు. 6–10 తరగతులకు 11.97లక్షలు, 11, 12 తరగతులకు 13.59 లక్షలు తీసుకుంటున్నారు.
- మరో స్కూల్‌లో స్నాక్స్, లంచ్‌ను స్కూల్‌లోనే సమకూరుస్తారు. ఎలిమెంటరీలో రోజుకు రూ. 350, సెకండరీలో రోజుకు 400 సమర్పించుకోవాల్సిందే.
- ఖానామెట్‌లోని కిండర్ గార్టెన్‌కు రూ. 1.63లక్షలు, 1–5 తరగతులకు రూ. 1.71లక్షలు, 6–10 వరకు 1.82లక్షలు, 11వ తరగతికి ఫీజు రూ. 2.28లక్షలు వసూలు చేస్తున్నారు.
- గచ్చిబౌలిలోని ఇంటర్నేషల్ స్కూల్‌లో నర్సరీ ఫీజు అక్షరాలా రూ. 3.6 లక్షలుండగా, 12వ తరగతి ఫీజు రూ. 10.5లక్షల పైమాటే



| New Student Fee | |
|---|---|
| A one-time, non-refundable new student fee is required for all first-time applicants. This fee must be paid in full to secure a child's placement and cannot be deferred or paid in instalments. | |
| Registration Fee<br>Due at the time of application submission. | INR 83,000.00/USD 1,000*<br>*Values in USD are approximate and subject to the conversion rates of the day |
| Enrolment Fee<br>Payable prior to the student(s) commencing school, following confirmation of admission. | INR 8,30,000.00/USD 10,000*<br>*Values in USD are approximate and subject to the conversion rates of the day |
| **Annual Tuition Fee** | |
| Kindergarten 1 and 2 | INR 8,73,900 |
| Grade 1-5 | INR 9,38,650 |
| Grade 6-10 | INR 11,97,600 |
| Grade 11-12 | INR 13,59,450 |
| **Other Fees** | |
| Snack and Lunch Cost (Optional)<br>(Payable on a semester basis) | • INR 350 per day (Elementary School)<br>• INR 400 per day (Secondary School) |
| Parent Association Dues<br>These dues provide the budget for the PA Executive Council to pay for programming, activities, and special events. | All families: INR 3000 |
| Tuition Refunds | |
| There will be no tuition fee refund for withdrawals during the semester. | |

## 31న కొత్త ఉస్మానియా దవాఖానకు శంకుస్థాపన ఏర్పాట్లుచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): ఈ నెల 31న గోషామహల్‌లో కొత్త ఉస్మానియా దవాఖాన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్టు సీఎం రేవంత్ తెలిపారు. కొత్త భవనాల నిర్మాణంపై సీఎం శనివారం తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వందేండ్ల అవసరాలకు తగినట్టుగా ఆధునిక వసతులతో నిర్మాణం ఉండాలని, దవాఖాన భవనాలు, బోధన సిబ్బంది, విద్యార్థులకు హాస్టళ్ల విషయంలోనూ నిబంధనలు పాటించాలని సూచించారు. సమావేశంలో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర, సీఎం సలహాదారు నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, సీఎం సంయుక్త కార్యదర్శి సంగీత సత్యనారాయణ, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూ, ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్స్ కమిషనర్ శశాంక, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు.

# అక్రమంగా 100 కిడ్నీలను మార్చేశారు!

- అలకనంద కిడ్నీ రాకెట్ దర్యాప్తులో కీలక విషయాలు
- అలకనందతో పాటు మరో రెండు దవాఖానల్లో దందా
- రిసీవర్ నుంచి 60 లక్షల వసూలు, డోనర్స్‌కు 5 లక్షలు
- 9 మంది అరెస్టు, పరారీలో ఆరుగురు: రాచకొండ సీపీ

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 25 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సరూర్‌నగర్ అలకనంద దవాఖానలో బయటపడ్డ అక్రమ కిడ్నీ మార్పిడి కేసు దర్యాప్తులో పోలీసులు కీలక విషయాలు గుర్తించారు. ఇప్పటికే 9 మందిని అరెస్టు చేయగా మరో ఆరుగురు పరారీలో ఉన్నారు. అరెస్టయిన వారిలో అలకనంద దవాఖాన ఎండీ సుమంత్, జనని, అరుణ దవాఖానల ఎండీ అవినాశ్, సహాయకులు ఉన్నారు. . కిడ్నీ రాకెట్ దర్యాప్తు పురోగతిని ఎల్బీనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో సీపీ సుధీర్ బాబు వెల్లడించారు.

**దందా ఎలా మొదలైందంటే!**

హైదరాబాద్‌కు చెందిన సిద్ధంశెట్టి అవినాశ్ చైనాలోఎంబీబీఎస్, పుణెలో సర్జరీ డిప్లొమా పూర్తి చేశాడు. కొంతకాలం పుణెలోని ప్రైవేటు దవాఖానలో వైద్యుడిగా పనిచేశాడు. 2022లో హైదరాబాద్‌కు వచ్చి సైదాబాద్ మాదన్నపేట్‌రోడ్‌లో జనని, అరుణ దవాఖానలు ఏర్పాటు చేశాడు. ఆర్థిక ఇబ్బందులతో దవాఖానలు అమ్మేయాలని నిర్ణయం తీసుకున్నాడు. అదే సమయంలో విశాఖపట్నంకు చెందిన లక్ష్మణ్ పరిచయమ్యయాడు. కిడ్నీ మార్పిడి దందా గురించి చెప్పాడు. దవాఖానలో సర్జరీ కోసం ఆపరేషన్ థియేటర్ సదుపాయం, సర్జరీ తర్వాత కేరింగ్ సదుపాయం కల్పిస్తే చాలు అని, మిగతా అంతా తాను చూసుకుంటానని తెలిపాడు. జీవన్‌దాన్ నుంచి కిడ్నీ మార్పిడి అవసరమున్న వారి వివరాలను లక్ష్మణ్ తీసుకుని, వారిని సంప్రదించి, బేరం మాట్లాడేవాడు. వివిధ ప్రాంతాల్లో పేదరికంలో మగ్గిపోయేవారిని మభ్యపెట్టి కిడ్నీ ఇచ్చేందుకు ఒప్పించేవాడు. కిడ్నీ దాతను, స్వీకర్తను, కిడ్నీ మార్చే డాక్టర్లను అందరినీ హైదరాబాద్ తీసుకొచ్చి అవినాశ్‌కు చెందిన జనని దవాఖానలో కిడ్నీ మార్పిడులు చేయించేవాడు. కిడ్నీ ఇచ్చిన వారికి 5 లక్షలు ముట్టజెప్పి, మార్పిడి చేసిన డాక్టర్‌కు 10 లక్షలు, ఆపరేషన్ థియేటర్‌లో ఐదుగురు సిబ్బందికి 30 వేల చొప్పున ఇచ్చేవాడు. దవాఖాన, ఆపరేషన్ థియేటర్ సౌకర్యం కల్పించిన అవినాశ్‌కు ఒక్కో కేసుకు 2.5 లక్షలు ఇచ్చేవాడు. ఇలా 2023 నుంచి 2024 జూన్ వరకు జనని దవాఖానలో కిడ్నీ మార్పిడి దందా నడిచింది. ఆ తర్వాత జనని దవాఖానను మూసివేసిన అవినాశ్ దందాను సరూర్‌నగర్‌లో సుమంత్‌కు చెందిన అలకనంద దవాఖానకు మార్చాడు. అక్రమ కిడ్నీ మార్పిడి ముఠాకు పవన్ అలియాస్ లియోన్ పరిచయం కావడంతో దందా భారీగా విస్తరించింది. పవన్ తన అనుచరుడు పూర్ణతో కలిసి శస్త్రచికిత్సలు జరపడంలో కీలకంగా వ్యవహరించాడు. సర్జరీలు చేసేందుకు తమిళనాడు వైద్యుడు శేఖర్ పెరుమాల్, జమ్ము కశ్మీర్ డాక్టర్ షోయబ్‌ను రంగంలోకి దింపాడు. తమిళనాడు, కర్ణాటకకు చెందిన ఆపరేషన్ థియేటర్ సహాయకులు శంకర్, ప్రదీప్, సూరజ్‌తో పెద్ద ముఠాను తయారు చేశాడు. థియేటర్ సహాయకులు కిడ్నీ అవసరమున్న రోగుల వివరాలు, కిడ్నీలు ఇచ్చేవాళ్లను వెతికే పనిలోనూ సహాయం చేసేవారు.

**గుట్టు రట్టయిందిలా!**

అలకనంద దవాఖానలో అక్రమంగా కిడ్నీ మార్పిడి జరుగుతున్నట్టు జనవరి 21న ఓ అజ్ఞాత వ్యక్తి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎల్బీనగర్ ఎస్‌వోటీ, సరూర్‌నగర్ పోలీసులు, రంగారెడ్డి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులతో కలిసి అలకానంద దవాఖానపై దాడులు జరిపారు. సుమంత్, గోపిని అదుపులోకి తీసుకుని విచారించగా కిడ్నీ మార్పిడి వివరాలు బయటపెట్టారు. శనివారం జనని దవాఖాన ఎండీ అవినాశ్, ఆపరేషన్ థియేటర్ సహాయకులు ప్రదీప్, రమావత్ రవి, రవీందర్, హరీశ్, సాయి, సూరజ్ మిశ్రాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రధాన నిందితులు పవన్, లక్ష్మణ్, పూర్ణ, తమిళనాడు డాక్టర్ రాజశేఖర్, జమ్మూ కశ్మీర్ డాక్టర్ షోయబ్, మధ్యవర్తి శంకర్ పరారీలో ఉన్నారు.

### ఒక్కనెలలోనే 20 కిడ్నీల మార్పిడి!

సరూర్‌నగర్‌లోని అలకనంద దవాఖానలో 2024 జూలై నుంచి కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు యథేచ్ఛగా జరిగాయి. ఒక్కో సర్జరీపై అవినాశ్‌కు వచ్చే రూ.2.5 లక్షల్లో రూ.1.5 లక్షలు అలకానంద ఎండీ సుమంత్‌కు చెల్లించేవాడు. ఇలా నిరుడు డిసెంబర్‌లోనే 20 కిడ్నీలు మార్చినట్టు పోలీసు దర్యాప్తులో తేలింది. 2023 నుంచి హైదరాబాద్‌లోని జనని, అరుణ, అలకానందతో పాటు ఇతర రాష్ట్రాల్లోని దవాఖానాల్లో ఈ ముఠా దాదాపు 100 కిడ్నీలు మార్చినట్టు తెలుస్తున్నది.



సంగారెడ్డిలో నిర్వహించిన మహాసభల్లో మాట్లాడుతున్న బృందా కారత్

## రెండు రాష్ట్రాల్లో బీజేపీ, కాంగ్రెస్ దోస్తానా

- ఇండియా కూటమిపై సన్నగిల్లుతున్న విశ్వాసం
- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కారత్

సంగారెడ్డి, జనవరి 26(నమస్తే తెలంగాణ) : తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్, బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం చేయకుండా పరోక్షంగా సహకరిస్తుందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కారత్ మండిపడ్డారు. సంగారెడ్డిలో శనివారం నిర్వహించిన సీపీఎం నాలుగో రాష్ట్ర మహాసభల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ఇండియా కూటమిలో అతిపెద్ద పార్టీ అయిన కాంగ్రెస్ మతతత్వ బీజేపీకి వ్యతిరేకంగా పోరాడటం లేదని, అందుకే ఇండియా కూటమి ఉపై విశ్వాసం సన్నగిల్లుతున్నదని తెలిపారు. మోదీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు 12 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసి.. ఆశవర్కర్లు, అంగన్‌వాడీలు, ఈజీఎస్ కూలీలకు మాత్రం డబ్బులు చెల్లించటం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో లిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఎం నేతలు వీరయ్య, చుక్కా రాములు, రంగారెడ్డి పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి...

20 రోజులపాటు ఉపాధి హామీ పనికి వెళ్లిన వారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇస్తామని స్పష్టం చేశారు. పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని, దరఖాస్తు చేసుకోనివారు ప్రజాపాలన సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని మంత్రి ఉత్తమ్ సూచించారు. అర్హత ప్రకారం దరఖాస్తులను పరిశీలిస్తామని అన్నారు. రేషన్ కార్డులు పొందిన వారందరికీ త్వరలో ఆరు కిలోల సన్న బియ్యాన్ని అందజేస్తామని చెప్పారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల రాష్ట్రవ్యాప్త అమలుపై ఫిబ్రవరి మొదటి వారంలో షెడ్యూల్ విడుదల చేస్తామని తెలిపారు. ఎవరైనా అనర్హులకు పథకాలు దక్కితే తమకు ఫిర్యాదు చేయాలని, వాటిని రద్దు చేస్తామని చెప్పారు.

# నేటి నుంచే 4 పథకాలు

**పథకాల అమలుకు ప్రత్యేక బృందాలు**

మండలంలో ఒక గ్రామాన్ని ఎంపికచేసి అర్హులైనవారందరికీ ఆదివారం నాలుగు పథకాలను అమలు చేయాలని, ఈ మేరకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసుకోవాలని సీఎస్ శాంతికుమారి కలెక్టర్లకు సూచించారు. ఆమె అన్ని జిల్లాల కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రేషన్‌కార్డులకు తాసీల్దార్ నేతృత్వంలోని బృందం, ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎండీవో ఆధ్వర్యంలో, రైతు భరోసా కోసం మండల వ్యవసాయ అధికారి, లేదా డిప్యూటీ తాసీల్దార్ లేదా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ఉపాధి హామీ పథకం ఏపీఓ నేతృత్వంలో బృందాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రారంభోత్సవ సభకు లబ్ధిదారులందరూ హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారుల జాబితాను గ్రామసభల్లో ప్రముఖంగా ప్రదర్శించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి రామకృష్ణారావు, సీఎం కార్యాలయ కార్యదర్శులు శేషాద్రి, చంద్రశేఖర్‌రెడ్డి, రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, గృహనిర్మాణ శాఖ కార్యదర్శి బుద్ధప్రకాష్ , పంచాయితీ రాజ్ శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### అధికారుల ఉరుకులు.. పరుగులు

నాలుగు పథకాల సంపూర్ణ అమలుకు మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంతో అధికారులు ఉరుకులు పరుగులు పెట్టాల్సి వచ్చింది. గ్రామాలను వెంటనే ఎంపిక చేయాలని మండల అధికారులకు శనివారం మధ్యాహ్నం అధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో వారు హడావుడిగా తమ పరిధిలోని గ్రామాల జాబితాను తీసి, పెద్దగా ఇబ్బందులు లేని గ్రామాలను ఎంపిక చేశారు. తర్వాత ఆయా గ్రామాలకు వెళ్లి పథకాల ప్రారంభానికి ఏర్పాట్లలో మునిగిపోయారు. ఇంకా అర్హులు ఎవరైనా మిగిలిపోయారా? కొత్తగా దరఖాస్తులు ఏమైనా వచ్చాయా? వంటి వివరాలు ఆరా తీశారు. లబ్ధిదారులను అందరినీ కార్యక్రమానికి తీసుకురావాలని ఆదేశించడంతో వారు ప్రతి ఒక్కరికీ సమాచారం అందించారు. ఇలా మండలస్థాయి అధికారులంతా అర్ధరాత్రి వరకు గ్రామంలోనే ఉండి ఏర్పాట్లు చేయాల్సి వచ్చింది.

## లెక్కతేలని 'భరోసా'!

- పూర్తికాని సాగుయోగ్యంకాని భూముల సర్వే
- వాటిని గుర్తించి ఫ్రీజ్ చేస్తేనే పెట్టుబడి సాయం
- పాత లెక్కలైతే 8,400 కోట్లిస్తామన్న మంత్రి భట్టి

హైదరాబాద్, జనవరి 25(నమస్తే తెలంగాణ): రైతుభరోసాకు సంబంధించి ఇంకా సాగు లెక్క తేలనేలేదు. సాగు యోగ్యంకాని భూముల లెక్కలు తేల్చేందుకు ప్రభుత్వం చేపట్టిన సర్వే ఇంకా పూర్తికాలేదు. ఈ నెల 26 నుంచి రైతుభరోసా పంపిణీ ప్రారంభమవుతుందా? లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వారం రోజులుగా రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నారు. ఈ సర్వే పూర్తయి.. ఆ జాబితా ప్రభుత్వానికి వస్తే గానీ ఏం చేయలేని పరిస్థితి ఉన్నదని అధికారులు చెప్తున్నారు. ఆ సర్వే ఆధారంగా భూములను గుర్తించి వాటికి రైతుభరోసా రాకుండా ఆన్‌లైన్‌లో ఫ్రీజ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సీజన్‌కు ఎలాంటి కోతలు లేకుండా అమలుచేస్తే 153 లక్షల ఎకరాలకు రైతుభరోసా ఇవ్వాల్సి ఉంటుంది. ఇందుకోసం రూ.9180 కోట్లు అవసరం అవుతాయి. అయితే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాత్రం రూ.8,400 కోట్ల వరకు రైతుభరోసా ఇస్తామని వివిధ సందర్భాల్లో ప్రకటించారు.

## బంగారం ఆభరణాలు చోరీ

ఎదులాపురం, జనవరి 25: బంగారు ఆభరణాలు బ్యాంకు లాకర్‌లో దాచుకుంటే అన్ని విధాలుగా సేఫ్ అని అందరికీ తెలిసిన విషయమే. కానీ బ్యాంకు లాకర్లల్లో సైతం దొంగలు పడిన ఘటనలు ఆదిలాబాద్‌లోని బ్యాంక్ ఆఫ్ ఇండియాలో చోటు చేసుకుంది. ఆదిలాబాద్‌లోని బ్యాంక్ ఆఫ్ ఇండియాలో (బీవోఐ)లో 23 అక్టోబర్ 2024 సంవత్సరంలో సంబంధిత బ్యాంకు ఉన్నతాధికారులు సాధారణ తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలో బ్యాంకు లాకర్‌లో 507.4 గ్రాముల(అర కేజీ) బంగారు ఆభరణాలు మిస్ అయినట్లు తనిఖీల్లో తేలింది. సుమారు వీటి విలువ రూ.29 లక్షల 20 వేలు ఉంటుంది. బ్యాంకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంబంధిత బ్రాంచ్ మేనేజర్ కమ్మరి గోవర్ధన్ శనివారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు. సుమారు ఐదుగురు బ్యాంక్ కస్టమర్లకు సంబంధించిన బంగారు ఆభరణాలు ఉన్నాయని బ్యాంక్ అధికారులు తెలిపినట్లు సీఐ తెలిపారు.

### బాలుడిని పనిలో పెట్టుకున్న మెకానిక్‌పై కేసు

ఎదులాపురం, జనవరి 25: బాలుడిని పనిలో పెట్టుకున్నందుకు మెకానిక్‌పై కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా ఆదిలాబాద్‌లో రెస్క్యూ చేపట్టారు. శనివారం భుక్తాపూర్‌లో ఆపరేషన్ స్మైల్ టీం ఎస్ఐ గౌతమ్ పవార్, టీం సభ్యులు, షూర్ ఎన్జీవో కోఆర్డినేటర్ వినోద్ తనిఖీలు చేశారు. భుక్తాపూర్ సమీపంలోని ధనలక్ష్మి ఆటోమొబైల్ ముందు నసీర్ ఆటో మెకానిక్ షాపులో 13 సంవత్సరాల బాలుడు పని చేస్తున్నాడు. కార్మిక శాఖ జూనియర్ అసిస్టెంట్ దని శంకర్ గుప్తా వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇచ్చిన ఫిర్యాదు మేరకు మెకానిక్ షాపులో పనిలో పెట్టుకున్నందుకు గను షేక్ నసీర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### వివాహిత అదృశ్యం

ఎదులాపురం, జనవరి 25 : ఆదిలాబాద్‌లోని ఖుర్షీద్ నగర్‌కు చెందిన వివాహిత అదృశ్యమైనట్లు టూ టౌన్ సీఐ సీహెచ్ కరుణాకర్ రావు తెలిపారు. ఖుర్షీద్‌నగర్‌కు చెందిన ఎన్నోవా కవిత (32) భర్త చంద్రకాంత్‌తో మనస్పర్థాలతో గొడవలు జరిగాయి. శనివారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయింది. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో టూ టౌన్‌లో భర్త ఫిర్యాదు మేరకు ఎస్ఐ విష్ణు ప్రకాశ్ మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

### విద్యుత్ సమస్యలపై వినతి

కుభీర్, జనవరి 25: నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని ఆయా గ్రామాల రైతులు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం ఏడాది క్రితం ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు డీడీలు చెల్లించారు. వారికి ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని మండల నాయకులు తూం రాజేశ్వర్, శంకర్ చౌహాన్, గంగయ్యలు శుక్రవారం వరంగల్‌లోని విద్యుత్ సౌద కార్యాలయంలో ఆశాఖ తెలంగాణ సీఎండీ వరుణ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. మండలానికి మరో 33కేవీ సబ్ స్టేషన్, మాలేగాంవ్‌కు ప్రత్యేక ఏఈ నియామకం, విద్యుత్ ప్రమాదాల్లో మృతి చెందిన పశువులు, రైతులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కాంపోజిషన్ ఆర్థిక పరిహారం డబ్బులు విడుదల చేయాలని కోరారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం దళితబస్తీ పథకంలో అందించిన దళిత రైతుల భూములకు వ్యవసాయ కనెక్షన్లు తక్షణమే ఇచ్చే విధంగా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సీఎండీ సానుకూలంగా స్పందించి సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని తెలిపినట్లు వివరించారు.

### పథకాలు ప్రారంభానికి ఏర్పాట్లు పరిశీలన

ఉట్నూర్ రూరల్, జనవరి 25: ప్రభుత్వం నేడు అమలు చేయనున్న ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డు పథకాలు ప్రారంభించడానికి ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని మత్తడిగూడ గ్రామంలో శనివారం రాత్రి తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో రాంప్రసాద్ ఏర్పాట్లను పరిశీలించారు. ప్రారంభోత్సవానికి పూర్తి ఏర్పాట్లు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మండలానికి ఒక్క ఊరే

**రాత్రిపూట అధికారుల సర్వే**

బేల, జనవరి 25 : ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని డోప్టాల గ్రామాన్ని రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుండి ఏర్పాటు చేయనున్న నూతన రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాల అమలుకు గానూ పైలట్ గ్రామంగా ఎంపిక చేసినట్లు మండల ప్రత్యేకాధికారి మనోహర్, ఎంపీడీవో మహేందర్ కుమార్ తెలిపారు. శనివారం రాత్రి మండల యంత్రాంగం గ్రామంలో ఇంటింటా సర్వే చేట్టడంతో పాటు అర్హుల జాబితాను రూపొందించేందుకు కసరత్తులు చేపట్టారు. లబ్ధిదారులు ఆదివారం మధ్యాహ్నం నిర్వహించే కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ రఘునాథ్ రావు, మండల పంచాయతీ అధికారి మహేశ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి జోగు ప్రణయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

**బేల్సరిరాంపూర్‌లో..**

తాంసి(భీంపూర్), జనవరి 25: ప్రభుత్వ పథకాలకు భీంపూర్ మండలం బేల్సరిరాంపూర్‌ను ఎంపిక చేయగా శనివారం రాత్రి అధికారులు, సిబ్బంది సర్వే చేశారు. లబ్ధిదారుల వివరాల గురించి స్పష్టత లేదు.

**అంతర్ని గ్రామంలో..**

కుభీర్, జనవరి 25 : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క 'మండలానికి ఒక గ్రామం' ఎంపికలో భాగంగా మండలాధికారులు ఎంపీడీవో నవనీత్ కుమార్, ఎంపీవో మోహన్‌సింగ్, ఏపీఓ రాథోడ్ హరిలాల్, పంచాయతీ కార్యదర్శి విజయ్ శనివారం రాత్రి అంతర్ని గ్రామంలో సర్వే నిర్వహించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డులు ఈ గ్రామంలోని ఎంతమంది లబ్ధిదారులను ఎంపిక చేశారనే దానిపై స్పష్టత వస్తుందని అధికారులు తెలిపారు. అంతర్ని గ్రామంలో రాత్రి అధికారులు వచ్చి సర్వే చేయడంపై గ్రామస్తులు విస్మయానికి గురవుతున్నారు.

**హస్నాపూర్‌లో..**

తాంసి, జనవరి 25: ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని హస్నాపూర్ గ్రామంలో ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు పథకాలపై అధికారులు శనివారం రాత్రి సర్వే చేశారు. సర్వేలో భాగంగా ప్రజాపాలన గ్రామసభలో 69 మంది కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోగా 11 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తహసీల్దార్ లక్ష్మి తెలిపారు. మండలానికి ఒక గ్రామం ఎంపికపై మిగతా గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వారి వెంట ఆర్ఐ సంతోష్, జూనియర్ అసిస్టెంట్ రాఘువేంద్ర, మాజీ సర్పంచ్ అలాలి జ్యోతి నర్సింగ్, నాయకులు చందర్ రెడ్డి ఉన్నారు.

బోథ్(ఇచ్చోడ(సిరికొండ), జనవరి 25: సిరికొండ మండలంలోని రిమ్మ, ఇచ్చోడ మండలంలోని నవేగాం గ్రామాల్లో శనివారం రాత్రి అధికారులు లబ్ధిదారుల ఎంపిక రీ సర్వే చేశారు. సిరికొండ మండలంలోని రిమ్మ గ్రామంలో జరిగిన గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇంటికి వెళ్లారు. ఇందులో భాగంగా ఇందిరమ్మ ఇండ్లు 197, కొత్త రేషన్ కార్డులు 26, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా 52, రైతు భరోసా 226 మంది లబ్ధిదారులు ఉన్నట్లు ఎంపీడీవో రవీందర్ తెలిపారు. అలాగే ఇచ్చోడ మండలంలోని నవేగాం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు 166, రేషన్ కార్డులు 82, ఆత్మీయ భరోసా 24, రైతు భరోసా 366 లబ్ధిదారులను గుర్తించినట్లు ఎంపీడీవో లక్ష్మణ్ తెలిపారు. ఇక్కడ కార్యదర్శులు శ్రీను, దేవత, అధికారులు ఉన్నారు.



బేల: డోప్టాలలో రాత్రి సర్వే చేస్తున్న అధికారులు



తాంసి: బేల్సరి రాంపూర్‌లో రాత్రి సర్వే చేస్తున్న అధికారులు, సిబ్బంది

**ఖత్‌గాంలో..**

భైంసాటౌన్, జనవరి 25: కొత్త పథకాలకు నిర్మల్ భైంసా మండలంలోని ఖత్‌గాం గ్రామం ఎంపికైంది. అధికారులు గ్రామంలో లబ్ధిదారుల రీ సర్వే చేశారు.

**నందన్‌లో..**

నర్సాపూర్ (జీ), జనవరి 25 : నిర్మల్ జిల్లా నర్సాపూర్ (జీ) మండలంలోని నందన్ గ్రామంలో శనివారం రాత్రి 12 కొత్త రేషన్ కార్డుల కోసం రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. అతి చిన్న గ్రామంలో మొత్తం 487 మంది ఓటర్లు ఉండగా అందులో 219 పురుషులు, 268 స్త్రీలు ఉన్నారు. మండలంలో అతి తక్కువ సంఖ్య ఉన్న గ్రామాన్ని ఎంచుకున్నారు.

### మండలానికి ఒక గ్రామం ఎంపిక

ఎదులాపురం, జనవరి 25: గణతంత్ర దినోత్సవం సందర్భంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆహార భద్రత కార్డుల పేరిట ఆదివారం నుంచి నాలుగు పథకాలకు శ్రీకారం చుట్టడం జరుగుతోందని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి, సంక్షేమ పథకాల అమలు కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించాలని అధికారులకు సూచించారు. అంతకుముందు రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి శనివారం మధ్యాహ్నం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. అనంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ నాలుగు సంక్షేమ పథకాల అమలు కోసం చేపట్టాల్సిన చర్యల గురించి సంక్షేమ పథకాల అమలు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రతి మండలంలో ఒక గ్రామం చొప్పున ఎంపిక చేసుకోవాలన్నారు. ఎంపిక చేసిన ప్రతి గ్రామంలోనూ పథకాల ప్రారంభోత్సవానికి పక్కాగా ఏర్పాట్లు చేయాలని అన్నారు. అనంతరం కలెక్టర్ నిర్వహించిన గూగుల్ మీట్ ద్వారా ముందుగా ముఖ్యమంత్రి సందేశంతో కూడిన ఆడియో, వీడియోను ప్రదర్శించాలన్నారు. గూగుల్ మీట్‌లో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రైనీ కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ట్రెజరీ శాఖ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 25 : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్మల్ జిల్లా ట్రెజరీశాఖ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని మహాలక్ష్మి ఆలయ ఆవరణలో క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రికెట్, బ్యాట్మెంటన్, చెస్, క్యారం క్రీడా పోటీలు నిర్వహించగా జిల్లా వ్యాప్తంగా ఖజానాశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు. చెస్ విజేతగా ఎస్టీవో రవిచంద్ర మొదటి బహుమతి, ద్వితీయ బహుమతి ప్రవీణ్, క్యారమ్‌లో ప్రథమ బహుమతి రంజిత్, క్రికెట్ పోటీలో ఎస్టీవో ధాత్రిక రమేష్ టీం గెలుపొందింది. కార్యక్రమంలో గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్, నాన్ గెజిటెడ్ ట్రెజరీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంఏ ఫయీం, విజయ్‌కుమార్, శ్యాంసుందర్, షకీల్ అహ్మద్ పాల్గొన్నారు.

### ఢిల్లీ రిపబ్లిక్ ఫరేడ్‌లో మండల వాసి

కుంటాల, జనవరి 25: కుంటాలకు చెందిన పెద్దోల్ల అనిల్ కుమార్ 2018 సంవత్సరంలో ఇండియన్ నేవిలో ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం కొచ్చిలో విధులు నిర్వహిస్తున్న సందర్భంలో విధి నిర్వహణలో ప్రత్యేక ప్రతిభ కనబరిచిన సందర్భంగా ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో నిర్వహించే రిపబ్లిక్ డే వేడుకల్లో నిర్వహించే పరేడ్‌లో పాల్గొనే అవకాశం వచ్చిన సందర్భంగా అనిల్‌ను పలువురు అభినందించారు.

### నేటితో ముగియనున్న మున్సిపల్ పాలక వర్గం

భైంసా, జనవరి 25: భైంసా మున్సిపాలిటీ 2020 జనవరి 22న ఎన్నికలు జరగగా పాలకవర్గాలు అదే నెల 27న కొలువు దీరాయి. మొత్తం భైంసాలో 26 వార్డులు ఉండగా ఎంఐఎం 15, బీజేపీ 9, ఇండిపెండెంట్ రెండు గెలుచుకున్నాయి. చైర్‌పర్సన్‌గా ఎంఐఎం నుంచి సబియా బేగం, వైస్ చైర్మన్‌గా జాబీర్ అహ్మద్ ఎన్నికయ్యారు. ఐదేళ్ల పాలనలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి తమ మార్పు చూపెట్టుకున్నారు. ప్రస్తుతం పాలకమండళ్ల గడువు ముగిసేలోగానే ఎన్నికలు పూర్తి చేయాలి. కాని కాంగ్రెస్ ప్రభుత్వం ఆ కోణంలో ఆలోచించడం లేదు. దీంతో మున్సిపాలిటీలు అస్తవ్యస్తమవుతున్నాయన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. గత సంవత్సరం గడువు ముగిసిన పంచాయతీలోనే ఇంత వరకు ఎన్నికలు నిర్వహించలేదు. పంచాయతీతో పాటు మున్సిపల్ ఎన్నికలు నిర్వహించే పరిస్థితులు తక్కువగా ఉన్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

### సంతోష్‌కు గ్రామస్తుల సన్మానం

కుభీర్, జనవరి 25: నిర్మల్ జిల్లా కుభీర్‌కు చెందిన రెడ్డిశెట్టి సంతోష్ ఇటీవల జరిగిన జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. శనివారం ఆయనను గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో విఠలేశ్వర ఆలయ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు పెంటాజీ, రాజన్న, నాగలింగం, వాసుదేవ్, రాజేశ్వర్, వెంకటస్వామి పాల్గొన్నారు.

### పోషకుల సమావేశం

బోథ్, జనవరి 25:  బోథ్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పోషకుల సమావేశం నిర్వహించారు. విద్యార్థుల పరిణితిని వారి తల్లిదండ్రులకు తెలిపారు. ఇంటి వద్ద చదువుకునేలా చూడాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ పాల్గొల్గొన్నారు.

## పరేడ్ మైదానం ముస్తాబు



ముస్తాబైన పరేడ్ మైదానం

ఎదులాపురం,జనవరి 25 : గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఆదిలాబాద్‌లో పరేడ్ మైదానంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9 గంటలకు కలెక్టర్ రాజర్షి షా జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, శకటల ప్రదర్శన, అవార్డుల ప్రదానం వాటికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎక్కడ ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

### ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు

బోథ్(తలమడుగు), జనవరి 25: ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని భరంపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయునిపై ప్రధానోపాధ్యాయురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సదరు ఉపాధ్యాయునికి సంబంధించిన మెడికల్ లీవ్‌కు కావాల్సిన సర్టిఫికెట్లు తేవాలని ఉపాధ్యాయుని కోరగా సకాలంలో సర్టిఫికెట్లు అందించలేదని వాటిపై అడగగా దురుసుగా మాట్లాడాడు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులకు ప్రధానోపాధ్యాయురాలు ఫిర్యాదు చేశారు. శనివారం పాఠశాలకు విచారణ చేసేందుకు అధికారులు వచ్చారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సదరు ఉపాధ్యాయుడు మాటమాట పెరిగి గొడవ కావడంతో 100కు ఫోన్ చేశారు. వెంటనే పోలీసులు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయుడిని పోలీస్ స్టేషన్‌కు రమ్మని చెప్పారు. అంతేకాకుండా ప్రధానోపాధ్యాయురాలు ఉపాధ్యాయుడిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

### పత్తి రైతుల కన్నెర్ర అంతర్రాష్ట్ర రహదారిపై ఆందోళన



అంతర్రాష్ట్ర రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

బేల, జనవరి 25 : ఆదిలాబాద్ జిల్లా బేలలోని ఆశాపుర జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోళ్లు చేపడుతున్నారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) అధికారులు ఇష్టారాజ్యంగా కొనుగోళ్లు చేపడుతుండడంతో శనివారం సాయంత్రం ఆరు గంటలకు అంతర్రాష్ట్ర రహదారిపై కూర్చొని నిరసన తెలిపారు. సీపీవో వచ్చే వరకు ఆందోళన విరమించమని నిరసన తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కొనుగోళ్లు చేపడతామని రైతులను సముదాయించినా ధర్నాను కొనసాగిస్తున్నారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన ధర్నా 9 గంటల వరకు కొనసాగింది. దీంతో కిలోమీటర్ల మేర ఇరువైపులా వాహనాలు నిలిచాయి. పోలీసులు వాహనాలను మరొక దారి నుంచి మళ్లించారు. ఘటనా స్థలానికి జైనథ్ సీఐ సాయినాథ్, బేల తహసీల్దార్ రఘునాథరావు, ఎస్సై దివ్యభారతి వచ్చి రైతులను సముదాయించారు. సోమవారం నుంచి పత్తి కొనుగోళ్లు చేపడతామని సీపీవో సుధీర్ తెలుపడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సీసీఐ అధికారులు ఇష్టారాజ్యంగా కొనుగోళ్లు చేపడుతున్నారని, దళారుల వాహనాలకు పూర్తి మద్దతు ధరతో కొనుగోలు చేయడంతోపాటు అమాయక రైతుల వాహనాలను నాణ్యత ప్రమాణాలు పేరిట తిరస్కరిస్తున్నారని మండిపడ్డారు.